క్లుప్తంగా

రేపటి నుంచి స్వాముల వారి ఆరాధనోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న రంగి కొండలపై వెలసిన ఆది చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వాముల వారి ఆరాధన మహోత్సవం ఈనెల 12న నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వాముల వారికి సుప్రభాత సేవ, అభిషేకం, గ్రామ దేవతల పూజలు నిర్వహించి, మధ్యాహ్నం విశిష్ట పూజల మధ్య మహానైవేద్యం సమర్పించి, సాయంత్రం బిందె సేవ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం స్వాముల వారికి ఆకుపూజ, భక్తాదులచే పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్థానిక రాముల దేవాలయం భజన బృందం వారిచే అఖండ భజన కార్యక్రమం ఉంటుందన్నారు. 13న మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయగలరని వారు కోరారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

పాణ్యం: పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో బ్యాంక్‌లకు చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అకౌంటెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్‌లోని సభ్యులు బ్యాంక్‌ల ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే క్రమంలో ఎలాంటి ఇబ్బందుల లేకుండా రసీదులు, అకౌంటెంట్లు చూసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎలాంటి తప్పులకు తావులేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: ఖరీఫ్ పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 36000 ఎల్‌పీ నంబర్లు ఉన్నాయన్నారు. ప్రతి రైతు సాగులో ఉన్నాడా, లేదా, ఏ పంట సాగు చేశాడు, పంటల కాలపరిమితి తదితర వివరాలు సేకరించి ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. రైతులు, కౌలు రైతుల వివరాలు సేకరించి నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏఓ జయప్రకాష్‌రెడ్డి, ఆర్‌ఐ రామ్, వీఆర్‌ఓలు, వ్యవసాయ క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో పైపులైన్ ధ్వంసం



పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో తాగునీటి పైప్‌లైన్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఉదయం ఉపాధ్యాయులు, విద్యార్థులు గుర్తించి ఎంఈఓ –2 సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు కూడా ఒకసారి పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారని, ఇది రెండోసారి అని తెలిపారు. ఈ ఘటనలపై పోలీసుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ట్యాంకులను శుభ్రం చేయించండి



మాట్లాడుతున్న అధికారులు

కల్లూరు: గ్రామాల్లోని ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయాలని ఎంపీడీఓ నాగేశేషాచలరెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో జీఎస్‌డబ్ల్యూఎస్ సేవల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి ట్యాంకుల వద్ద నీటిని ఎలా పరీక్ష చేయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ పాల్గొన్నారు.

రైతు బేజారు !

- దళారుల గుప్పిట్లో రైతుబజారు
- అధికారులను శాశించే స్థాయికి ఆగడాలు
- ఒక్కొక్కరు రెండు స్టాళ్ల అక్రమణ
- నిజమైన రైతులకు నిత్యం అవమానాలే
- నిబంధనలు అమలైతే ఒట్టు
- బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోని వైనం



రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరల విక్రయం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దళారులను కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్న ఎస్టేటు అధికారికి ఎదురు తిరుగుతున్నారు. నువ్వు ఏమి చేసుకుంటావో.. చేసుకో.. మాకూ పరపతి ఉంది.. నిన్ను ఎక్కడ పెట్టాలో మాకు తెలుసుంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. అధికారి పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. రైతుబజారులో బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోరు. తూకాలు సక్రమంగా ఇవ్వరు అంటూ చాలా రోజులుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని సి.క్యాంపు రైతు బజారు రాష్ట్రంలోని ప్రధాన రైతు బజార్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇక్కడ టీడీపీ, బీజేపీ, జనసేన నేతలే దళారులను ప్రోత్సహిస్తున్నారు. నేతల అండదండలు ఉండటంతో దళారులు చెలరేగిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్న వారిలో అత్యధికులు దళారులే కావడం గమనార్హం. దళారులు రైతు బజారులోకి రైతులను రానివ్వరు. ఎవరైన పండించిన కూరగాయలను అమ్ముకుందామంటే స్థలమే దొరకదు. నిజమైన రైతులకు అడుగడుగునా అడ్డంకులే. దళారుల ఆగడాలకు తట్టుకోలేక సరుకు తెచ్చుకున్న రైతులు దళారులకు ఏదో ఒక ధరకు విక్రయించుకొని పోవాల్సిందే. నిజమైన రైతులకు మూలన మరుగుదొడ్ల దగ్గర చోటు చూపించి అక్కడ అమ్ముకోమని చెబుతారు. చివరకు సరుకు అమ్ముడు పోకపోతే దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని బయటికి పోవాల్సిందే. దళారులను తట్టుకోలేక రైతులు బయటకు వెళ్లక తప్పడం లేదు.

బోర్డుపై రాసిన ధరలను పట్టించుకుంటే ఒట్టు

రైతుబజారులో బోర్డుపై రాసిన ధరలను పట్టించుకున్న పాపన పోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బోర్డుపై రాసిన ధరలకే విక్రయించాలని మైకు ద్వారా అనౌన్స్‌మెంటు ఇస్తున్నా పట్టించుకునే వారు లేరు. దీనికి తోడు తూకాల్లోను చేతివాటం చూపడం ఎక్కువైంది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో వినియోగదారులతో రైతుబజారు కిటకిటలాడింది. బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోవడం లేదంటూ, తూకాల్లో దగా చేస్తున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రైతుబజారులో నిజమైన రైతులు ఉంటే ఇలాంటి పరిస్థితులు ఉండవు. దళారులే ఉండటం వల్ల ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం రైతుబజారులో కూరగాయలు అమ్మకోవాలంటే పొలం ఉండి కూరగాయలు సాగు చేస్తుండాలి. కూరగాయలు సాగు చేస్తున్నట్లుగా హార్టికల్చర్ కన్సల్టెంటు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంది. అటువంటి రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తారు. వారు మాత్రమే కూరగాయలు అమ్మకోవాల్సి ఉంది. ఇది రైతుబజారులో ఏ మాత్రం అమలు కావడం లేదు. సెంటు పొలం లేని దళారులు ఇటు రైతుల నుంచి అటు కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నుంచి సరుకు కొని తెచ్చుకొని అమ్మకుంటున్నారు.

నిజమైన రైతుకు అవమానం

కర్నూలు మండలం పడిదెంపాడు గ్రామానికి చెందిన రహిమాన్ అనే రైతు క్యాబేజీ సాగు చేశారు. పండించిన క్యాబేజీని రైతుబజారులో అమ్ముకునేందుకు వరుసగా రైతుబజారుకు వస్తున్నారు. పలుబస్టాల్లో క్యాబేజీ తెచ్చిన రైతును పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. రెండు, మూడు రోజులు తిరిగినప్పటికి స్థలం ఇవ్వలేదు. ఎక్కడైన కూర్చుంటే దళారులు ఈ స్థలం మాది అని లేపుతున్నారు. చివరికి వినియోగదారులు వెళ్లని చోటు మరుగుదొడ్ల వద్ద స్థలం చూపించి అక్కడ కూర్చొని క్యాబేజీ అమ్ముకోమన్నారు. రోజంతా కూర్చున్నా 10 కిలోల క్యాబేజీ కూడా అమ్ముకోలేకపోయారు. నిజమైన రైతులకు ఇలా అవమానం జరుగుతుంటే, దళారులు స్టాళ్లలో అన్ని రకాల కూరగాయలు పెట్టుకొని, బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

పెత్తనమంతా దళారులదే !

రైతుబజారులో పెత్తనమంతా దళారులదే. క్రిష్ణగిరి, బాపురం, ఆత్మకూరు, బస్తిపాడు, పడిదెంపాడు, భూపాల్‌నగర్, నన్నూరు ప్రాంతాలకు చెందిన కొంతమందికి సెంటు భూమి లేకపోయినప్పటికీ రాజకీయ అండదండలతో రైతు బజారులో తిష్ట వేశారు. కొంతమందికి భూములున్నా కూరగాయల సాగే ఉండదు. కనీసం 30 మంది దళారులు రెండేసి స్టాళ్లను అక్రమించి హవా నడిపిస్తున్నారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికీ స్టాళ్లు ఉన్నాయంటే దళారులు రైతుబజారులో ఏ స్థాయిలో పాతుకుపోయారో తెలుస్తోంది. భార్య, భర్త, కూతురు, కుమారుడు ఇలా అందరు స్టాళ్లు దక్కించుకున్నారు. వీరికి భూములు ఉన్నాయంటే సెంటు కూడా లేదు. వీరు కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నుంచి కూరగాయలు తెచ్చుకొని రైతుబజారులో అమ్మకాలు సాగిస్తున్నారు. కనీసం 100 మందికిపైగా దళారులు రైతుబజారులో తిష్ట వేయడం వల్ల రైతులకు న్యాయం జరగడం లేదు. మూడు, నాలుగు నెలల క్రితం దళారులందరినీ బయటకి పంపినప్పటికీ రెండు, మూడు రోజుల్లోనే రాజకీయ నేతల సిఫార్సులతో తిరిగి ప్రవేశించి రైతుబజారు అధికారి, సిబ్బందిపైనే ఎదురు తిరుగుతున్నారు. దళారుల ఏరివేతకు జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, దళారులకు రాజకీయ నేతల అండదండలు ఉండటంతో రైతుబజారు అధికారి, సిబ్బంది అంటే లెక్కలేనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్, వెల్దుర్తి తదితర ప్రాంతాల నుంచి కొందరు రైతులు కూరగాయలు, ఆకుకూరలు తెచ్చుకుంటే లోనికి రానివ్వకుండా బయటనే దళారులు కొంటారు.

బెల్ట్‌షాపులు ఎత్తివేయాలి

- లొద్దిపల్లె ఎంపీటీసీ నాగ శిరీష నిరసన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాగశిరీష

ఓర్వకల్లు: తమ గ్రామంలో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన బెల్ట్‌షాపులను ఎత్తివేయాలని కోరుతూ లొద్దిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు నాగ శిరీష బుధవారం మండల పరిషత్ సమావేశ భవనం ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి నాగ శిరీష తన చంటి బిడ్డతో హాజరయ్యారు. సమస్యలను అధికారుల దృష్టి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడం లేదంటూ ఆమె బయటకు వచ్చి ఆందోళన చేపట్టారు. గ్రామంలోని బండ్ల కనుమలో ఉన్న సర్వేనంబర్ 129/ఎ, 130ఎలలో ప్రభుత్వ భూమిని కొన్నేళ్ల నుంచి 100 మంది పేదలు సాగు చేసుకుంటుండటంతో వారికే పట్టాలు, పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పేర్లపై ఆన్‌లైన్‌లో ఎక్కించాలని రైతులు పలు మార్లు అధికారులను కోరినా అటవీ భూమి అంటూ కాలయాపన చేస్తుండటం తగదన్నారు. అలాగే గ్రామ నడిబొడ్డున కొందరు బెల్ట్‌షాపులు నిర్వహిస్తుండటంతో మహిళలు, చిన్న పిల్లలు అటు వెళ్లేందుకు జంకుతున్నారన్నారు. ఎంపీటీసీలకు 18 నెలల నుంచి పెండింగ్ ఉన్న జీతాలు చెల్లించాలన్నారు. తహసీల్దార్ విద్యాసాగర్ స్పందిస్తూ లొద్దిపల్లె గ్రామంలో సాగు చేసుకుంటున్న భూములు అటవీశాఖ పరిధిలోకి వస్తాయన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే హక్కు తమకు లేదన్నారు.

సభ్యుల గైర్హాజరుతో బోసిపోయిన మండల సమావేశం

ఓర్వకల్లు: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సభ్యుల గైర్హాజరుతో బోసిపోయింది. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు హాజరయ్యారు. 22 మంది సర్పంచులకు గాను ఐదుగురే హాజరయ్యారు. 17 మంది ఎంపీటీసీ సభ్యులకు గానూ ఎనిమింది మందే హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు సైతం సమావేశానికి డుమ్మా కొట్టడంతో సమావేశం తూతూమంత్రంగా సాగింది. రోడ్డు రవాణా, ఉద్యాన శాఖ, అటవీ శాఖ, నీటిపారుదల శాఖ, ఆబ్కారీ శాఖల అధికారులు హాజరుకాలేదు. సంబంధిత శాఖల అధికారులు ఇంతవరకు ఒక్క సర్వసభ్య సమావేశానికి హాజరైన దాఖలాల్లేవు. ఆయా శాఖల సమస్యలను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలని ప్రజా ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. అంతకుముందు పలువురు అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ విద్యాసాగర్

అనంతరం సభ్యులు మాట్లాడుతూ తమకు 18 నెలల నుంచి గౌరవ వేతనాలు చెల్లించడం లేదని సభ దృష్టికి తెచ్చారు. ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండ్ నుంచి మర్రిచెట్టు వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును బాగు చేస్తారా, లేదా అంటూ జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్ గౌడు అధికారులను ప్రశ్నించారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వడం లేదని, కనీసం రాబోయే రబీ సీజన్‌కు అయినా సబ్సిడీ శనగ విత్తనాలను సకాలంలో అందజేయాలని మీదివేముల ఎంపీటీసీ సభ్యులు పద్మనాభరెడ్డి వ్యవసాయాధికారిణి మధుమతిని కోరారు.

అర్హులందరికీ ఇంటి స్థలం

– జాయింట్ కలెక్టర్ నవ్య



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కల్లూరు: అందరికి ఇళ్లు పథకంలో భాగంగా అర్హులందరికీ స్థలం మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ నవ్య అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని బస్తిపాడు గ్రామంలో కొత్త లేఅవుట్‌ను ఆర్‌డీఓ సందీప్‌కుమార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్ల స్థలాన్ని అర్హులకు ప్రభుత్వం మంజూరు చేస్తుందని జేసీ తెలిపారు. లేఅవుట్‌ను త్వరితగతిన పూర్తి చేసి అర్హులందరికీ పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ ఆంజనేయులును ఆదేశించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుధాకర్, ఆర్‌ఐ రంగస్వామి, వీఆర్వో రామకృష్ణ, సర్వేయర్ శబరి పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయండి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలోని వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ బాధ్యతాయుతంగా పని చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సెక్రటరీ మహేంద్రనాథ్‌రెడ్డి నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు అబ్జర్వర్‌గా నియమితులైన సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డిని మర్యాదపూర్వంగా కలిసి పూలమాలతో సత్కరించారు. కష్టపడిన వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు.

నాణ్యమైన దిగుబడులు సాధించాలి



వెంకటగిరిలో ఉల్లి రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఏఓ

కోడుమూరు రూరల్: ఉల్లి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. మండలంలోని వెంకటగిరి, గోరంట్ల గ్రామాల్లో ఉల్లి పంట సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో తహసీల్దార్ నాగరాజు, ఏఓ రవిప్రకాష్ సమావేశమై ఉల్లి నాణ్యత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఓ మాట్లాడుతూ.. రైతుల నుంచి ఉల్లి దిగుబడులను ప్రభుత్వం క్వింటా రూ.1200 ప్రకారం మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని, రైతులంతా బయట వ్యాపారస్తులకు అమ్ముకుని నష్టపోకుండా మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. వెంకటగిరి గ్రామ రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు మండలంలోని చనుగొండ్ల గ్రామంలో బుధవారం ఏఓ దస్తగిరి రెడ్డి పత్తి పంట సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటకు సోకే గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఏఓ రైతులకు వివరించారు.

నానో ఎరువుల వాడకం సులువు

సి.బెళగల్: నానో ఎరువుల కొనుగోలు, వినియోగం సులభతరంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. ఆయన బుధవారం మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లో పొలం పిసుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ఆయా గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పత్తి, ఉల్లి పంటలను పరిశీలించారు. రైతులకు నానో ఎరువులపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. నానో ఎరువులు (యూరియా, డీఏపీ) తక్కువ ఖర్చుతో, అధిక శ్రమ లేకుండా సులువుగా వినియోగించుకోవచ్చన్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అదేవిధంగా ఉల్లి పంటలను పరిశీలించిన ఆయన రైతులకు ఉల్లి పంట సాగు, కోతలపై అవగాహన కల్పించారు. రైతులు ఉల్లి నాటుకున్న 100 - 120 రోజుల్లో మాత్రమే కోతలు చేపట్టాలని, కోతల అనంతరం కనీసం 15 రోజులు బాగా ఆరబెట్టి తేమ లేకుండా చూసుకోవాలని, అనంతరం గ్రేడింగ్ చేపట్టాలని సూచించారు. ఏఈఓ హిమబిందు, వ్యవసాయ సిబ్బంది సాయితేజగౌడ్, ఉమాదేవి, రైతులు పాల్గొన్నారు.



గొల్లలదొడ్డిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సుఖ వ్యాధులపై అవగాహన

కర్నూలు(రూరల్): మండల పరిధి నందనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో సుఖ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డీఆర్‌పీ నాగరాజు మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ పట్ల యు వత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ వ్యాధికి చికిత్స లేదని నివారణే మార్గమని వివ రించారు. సురక్షితం కాని లైంగిక సంబంధా లు,హెచ్‌ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజ్‌లు, పరీక్షింపబడని రక్తం ద్వారా ఎయిడ్స్ సంక్రమిస్తుందని వివరించారు. హెచ్‌ఐవీ పట్ల ఎలాంటి సందేహాలు, అనుమానాలున్నా జాతీయ హెల్ప్‌లైన్ 1097 కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యాక్రమంలో రామసుబ్బారెడ్డి, సత్యవాణి, శశికళ, నాగలక్ష్మీ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

అశోకాలో ఉడాన్-2025 ఓరియంటేషన్

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోకా మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఉడాన్-2025 ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టీసీఎస్ రీజినల్ హెడ్ అకాడమిక్ అలయెన్స్‌స్ (ఏపీ, టీజీ) రిచర్డ్ కింగ్ చత్రగడ్డ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కృషి, క్రమశిక్షణ, నిబద్ధత విజయానికి ప్రధాన ఆస్తులన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్‌ను సక్రమంగా నిర్వహించాలి



వర్మీకంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

పాణ్యం: వర్మీ కంపోస్ట్‌ను సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సిబ్బందికి సూచించారు.బుధవారం మండలంలోని సుగాలిమెట్ట గ్రామంలో వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను పరిశీలించారు. ఐవీఆర్‌ఎస్ కాల్స్‌పై విచారణ చేపట్టారు. ప్ర జలకు ఇబ్బంది లేకుండా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీపీఓ లలితాబాయి ఉన్నారు.

నివాళి



సుదర్శన్ రెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేస్తున్న కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిగువపాడు గ్రామ వెఎస్సార్‌సీపీ నాయకులు వంగూరు సుదర్శన్ రెడ్డి (65) గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు అస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఆ గ్రామ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టరు ఆదిమూలపు సతీష్ బుధవారం దిగువపాడు గ్రామం చేరుకొని సుదర్శన్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఎం.కే.వెంకటేష్,గ్రామ నాయకులు చంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, వీరభద్రరెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, దస్తగిరి, బాషా తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

- అభివృద్ధి పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంపై సభ్యుల ఆగ్రహం

కోడుమూరు రూరల్: గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ రమేష్‌బాబు బుధవారం నిర్వహించిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సాదాసీదా జరిగింది. సమావేశానుద్దేశించి వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, కౌన్సిలర్లు మాట్లాడుతూ.. నగర పంచాయతీలో నిధులున్నా గతంలో పని చేసిన అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేకపోయారని, ఇక నుంచి అధికారులు సక్రమంగా పనులు చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. గూడూరు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కౌన్సిలర్ల ఫోన్లు ఎత్తకుండా, ప్రజలకు సరైన సమాధానం చెప్పకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, వైస్ చైర్మన్ లక్ష్మన్న, కౌన్సిలర్లు దస్తగిరి, ఖలీల్, మౌనిక, పద్మావతి, బుడ్డాంగలి, సురేష్ నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు

అందని 'డిజిటల్' సేవలు

- రేమటలో డిజిటల్ అసిస్టెంటు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పొరుగూరు సచివాలయం వెళ్లి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి

కర్నూలు(రూరల్): మండల పరిధి రేమట గ్రామ సచివాలయంలో ఉద్యోగులు కనిపించడం లేదు. ఇక్కడ డిజిటల్ అసిస్టెంట్‌గా ఉన్న మహిళ ఉద్యోగి 8 నెలలుగా విధులకు హాజరుకావడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఈమె కర్నూలు నగరంలోని స్టేడియం నందు డెప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారులు తెలిపారు. గ్రామంలో డిజిటల్ అసిస్టెంట్ లేనందున వివిధ ధ్రువ పత్రాలు పొందడం ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొరుగూరు ఉల్చాల గ్రామ సచివాలయ సిబ్బంది వద్దకు వెళ్లి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అక్కడ వారు అందుబాటులో లేకుంటే సచివాలయం వద్ద గంటల తరబడి వేచి ఉండాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికెట్, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, పొలాల మ్యూటేషన్‌తో పాటు స్కూల్ పిల్లలు కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు పొందేందుకు అగచాట్లు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రేమట గ్రామ సచివాలయానికి డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: ఎంపీపీ శారద అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశేషాచలరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సురవరం ఆశయ సాధనకు కృషి

కోడుమూరు రూరల్: ప్రజాసేవ కోసం సర్వం త్యాగం చేసిన దివంగత, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి అడుగుజాడల్లో నేతలంతా నడవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. బుధవారం కోడుమూరులో సీపీఐ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డితో పాటు ఆదిమూలపు సతీష్ హాజరై సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి భూస్వామి కుటుంబంలో జన్మించినప్పటికీ విద్యార్థి దశ నుంచి విప్లవ భావాలతో ముందుకెళ్లి ప్రజా సేవా కోసం తన యావదాస్తిని దారదత్తం చేశారన్నారు. అహర్నిశలు ప్రజాసేవ కోసం పాటుపడిన సురవరం సుధాకర్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాయర్ ప్రభాకర్, సీనియర్ నాయకులు హేమాద్రి రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎద్దుల మహేశ్వరరెడ్డి, సీపీఐ నాయకులు క్రిష్ణ, రాజు, శేషుకుమార్, చిన్న రాముడు, ప్రజా సంఘాల నాయకులు గఫూర్ మియ్యా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

కోడుమూరు రూరల్: గూడూరులోని ఎరువుల దుకాణాల్లో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారి విశ్వనాథ్ మండల వ్యవసాయాధికారి దస్తగిరిరెడ్డితో కలిసి ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ఎరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎరువుల స్టాక్‌కు సంబంధించిన రికార్డులు సరిగా లేనందున సత్యనారాయణ ట్రేడింగ్ కంపెనీలో రూ.1,89,000 విలువ చేసే 9 టన్నుల ఎరువులు, రామక్రిష్ణ ట్రేడర్స్‌లో రూ.3,28,000 విలువ చేసే 10 టన్నుల ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు